# బాధ కవిత్వానికి పర్యాయపదం

చక్కని పద్యాలు రాసి నీకు వినిపించాడే చవితినాడు, ఆ కుర్రాడు చాలా బాధపడు తున్నాడని వినీ వినగానే నాకేదో వేదనా, అణులేశం ఆవేశం, ఆ మట్టునే ఆగ్రహం వచ్చి, అటువంటివాళ్ళ అవస్థలమీద ఖర్చు పెట్టడానికి నా దగ్గర కన్నీళ్ళు లే వన్నాను.

బాధపడటం చేతకానివాళ్ళు పద్యాలు రాస్తే బాధపడడం భరించలేని వాళ్ల పద్యాలు చదివితే, పద్యాలు అందులోకీ యతిప్రాసల్లేని అర్థంలేని పద్యాలు రాసి బాధ పడడం, అర్థంలేని బాధపడడం, యతిప్రాసల్లేని బాధపడడం అన్నా న్నేను.

ఆ కుర్రాడు నా దగ్గరికి వచ్చిన మాట నిజమే. పద్యాలు చదివినమాట నిజమే. నే నతణ్ణి పొమ్మన్నమాటా నిజమే. నే నతణ్ణి యెందుకు పొమ్మన్నానో చెప్పడానికే ఈ కథ.

కథా అన్నాను? సంఘటనల్లేని, సంచలనంలేని, కర్త, కర్మ, క్రియల్లేని కథ నాన్ని కథనడం ఎట్లా. ఇప్పుడే చెబుతున్నా నిందులో ఒక పూరిల్లుగాని, పచ్చ కర్పూరంగాని, చివరి కొంక సిగరెట్టు కాని తగలెట్టేటప్పుడు బయల్దేరే పొగలో కనిపించే కదలికపాటిది కూడా ఈ రాతలో మీకు కనబడదు. మెదడు తగలబడి పోయేటప్పటి పొగ కాని పొగ కదలనట్టు కనిపించే కదలడం, జరగనట్టు కనిపించే జరగడం ఇందులో చూపించాలని ఎందుకో ప్రయత్నం.

నీ తరువాతి తరం యువకవి నీ దగ్గరికి వచ్చినప్పుడు నిర్దాక్షిణ్యంగా పొమ్మ న్నావు. అతని పాటలోని బాధ నీ కళ్ళ వెనక నీళ్ళలో ఈదుతోందని నీకు బాగాతెలుసు. అయినా పొమ్మన్నావు. ఉప్పెనగా ఉద్గమించబోతున్న కన్నీళ్ళను అటకాయించి.

'అపాయానికి ఇటుదారి' అని ఎక్కడైనా ఎవరైనా ఒక హెచ్చరికను ప్రతిష్ఠిస్తే ఎంత బాగుండును.అప్పుడు మనం అంతమందిమీ అటు వెళ్ళడం మానేద్దుము.

మానేస్తామా? ఏమో అబ్బా? నా మట్టుకు నేను అపాయాలని అన్వేషించడం లోనే ఆనందం పోగుచేసుకుంటాను. ఇంకా యెందరో ఉన్నారు, ఇలాంటి నాలాంటి

వాళ్లు. అపాయం స్వభావాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలంటారు వాళ్ళు. నిషేధాలు విధిస్తూ నిలబడే పోలీసుల బలం నిరుపయోగం వీళ్ళ విషయంలో.

అపాయం బోర్డుకట్టి అటువెళ్ళకుండా ప్రజల్ని శాసనాలద్వారా అరికట్టి అపాయానికి ఇవతలివేపు క్షేమాన్ని వెదజల్లడానికి ప్రభుత్వాలన్నీ కృషిచేస్తూనే ఉంటాయి. కాని ఏం లాభం? అవతల ఏముందో చూడడానికి మానవుడిలో కుతూహలం ఉన్నంత కాలం బోర్డుచేసే హెచ్చరిక నిశ్శక్తం, నిర్వీర్యం.

సుమతీ శతకం స్తవనీయమే. సెన్సారుబోర్డు అభిలషణీయమే. శాసనసభ అవశ్యం గౌరవనీయమే. అయితే నేం? అపాయానికిగల ఆకర్షణని నేను కొనియాడడం మానలేను.

ఈ కుర్రాడున్నాడే వీడు అపాయాల స్వభావం కనిపెట్టాలని ఉబలాటం ఉన్నవాడు. ఆ పద్యాలు చదివినప్పుడే తెలిసింది నా కా సంగతి. పద్యాలుగా అవి బాగానే ఉన్నాయి కాని, అని బతకవని నాకు తెలుసు. ఎందుకో చెప్పనా?

ఒకసారి నేను చాలా ప్రమాదకరమైన పరిస్థితిలో చిక్కుకున్నాను. ఎవరిదో అరచెయ్యి. దాని మీద ఒక గుండు సూది అంటీ అంటనట్లు నిలబెట్టి ఉంది. దాని మీద నేను ఒంటికాలి మీద నిలుచున్నాను. అంతవరకు బాగానే వుంది. అటువంటి సర్కసు ఫీట్లు నేను సునాయాసంగా సాగించగలను. ఇక దిగిపోవా లనుకుంటున్న సమయానికి నా నెత్తిమీద గ్రంథాలయాల దండయాత్ర ప్రారంభమైంది. ఎంత బరువుందో యిప్పుడు జ్ఞాపసం లేదు. కాని, ప్రపంచ కవుల రచనల సంపూర్ణ సంపుటం నా తలమీద వచ్చి వాలింది. దాని మీద నానా భాషల నిఘంటువులు, ఉగాది సంచికలు ఒత్తుతున్నాయి. ఇంకా ఇంకా మీదిమీదికి పోనుపోనూ అనంతంగా అనేక గ్రంథాలు, షేక్సిపియరు సమస్త రచనల మేలు ముద్రణం వ్యాఖ్యాన గ్రంథాలతో సహా నోస్‌డైవ్ చేసినప్పుడు నా మెదడులో అణువు బ్రద్దలైనట్టయింది. ఆకాశంవైపు పెరిగిపోతున్న గ్రంథాల భారం నన్ను క్రుంగదీస్తోంది. అంతసేపూ ఒంటికాలుతో గుండుసూదిమీద నిలబడే ఉన్నాను. గుండు సూదిని కదలకుండా నిలబెట్టగలిగినవాడి చాకచక్యానికి తీసిపోగూడదని పౌరుషానికి నిలుచున్నాను. భార బాధ భరిస్తూ. కాలైనా మార్చుకోడానికి వీల్లేదు. నా నెత్తిమీద ఎన్ని పుస్తకా లున్నాయో స్పష్టంగా తెలియదు. వాతావరణంలోని వివిధ పరిణామాలను చర్మంతో పీలుస్తూ గ్రంథాల పేర్లు పోలుస్తున్నాను. మధ్యమధ్యన ఎక్కాల

పుస్తకాలూ అచ్చు తప్పులతో నిండి అణాకి, అర్ధణాకి, అమ్ముడుపోతున్న చవకబారు పుస్తకాలు గ్రుచ్చుకుంటున్నాయి. అమూల్యమైన తాటాకు గ్రంథాలతో తంజావూరు లైబ్రరీ నా నెత్తిమీద పడింది. తామ్ర శాసనాలూ శిలాశాసనాలు తగులుతున్నాయి. నా రక్తనాళాలలోని నెత్తురు వాటి ఒత్తిడిని అనుభవిస్తోంది.

నామీద గ్రంథాలూ—నాకింద గుండుసూదీ! ఏ తెలియరాని గణితశాస్త్ర సూత్రంవల్లనో అవి నిలబడి నన్ను నిలబెట్టాయి.

అరచెయ్యి అభయహస్తం. పడిపోతానని భయం లేదుగాని పాడడానికేమీ తోచలేదు. పాడాలనే బాధ మాత్రం పొడుస్తోంది. ఏది పాడినా ఈ పుస్తకాల సారమే. జీవితానుభవమే కావ్యవస్తువు కావాలని నా కప్పటికింకా తెలియదు.

ఈ యిరుకు పరిస్థితిలో చిక్కుకొని ఏదో పాటపాడాను. ఆ పాట చాలామందిని అకర్షించిందికూడా. అరచేతి కిరుపక్కలా ఉన్న అగాథపు లోయల్లో తండోపతండాలుగా క్రిక్కిరిసిపోయిన ప్రేక్షకజనం అయిదునిమిషాల ఇరవై సెకండ్లసేపు కరతాళధ్వనులు చేసి నా పాటని అభినందించారు.

ఆ పాటకు ముగ్ధుడైపోయాడు ఈ కుర్రాడు. దానికి అందమైన అనుకరణలు తయారుచేశాడు. అదీ నా కోపం. అతణ్ణి పొమ్మన్నాను. అందుకే అతని పాటలు బతకవన్నాను.

నువ్వు స్వయంగా అపాయాల్లోకి వెళ్ళు. ఎరువు తెచ్చుకొన్న అభిప్రాయాల్ని తగలబెట్టడానికి వీలుగా ఒక అగ్గిపెట్టె నీతో తీసుకు వెళ్ళటం మరచిపోకు. గుండు సూదిమీద ఒంటికాలితో నిలబడడం గొప్పమాటే, కాని అదే అంత గొప్పకాదు. ఇంకో కవి—ఎంత గొప్పవాడైనా—నువ్వు వాడివి కావాలని ప్రయత్నించకు. ఇన్నాళ్ళు నువ్వు అర్ధానుస్వారంలాగ, ముద్రారుడిలాగ బతికేవు. పేపరు వెయిట్ లాగ, రబ్బర్‌స్టాంపులాగ బతికేవు. వెళ్ళు జీవితంలోకి.

రెండోరకం పద్యంలోకూడా బాధ వుంటుంది. కాని అది బతికే బాధకాదు. బతికించే బాధ కానేకాదు.

ముద్రణ: ఆంధ్ర పత్రిక సంక్రాంతి సంచిక 1954 జనవరి 3
ద్వితీయ ముద్రణ: నవత ద్వితీయ సంచిక శోభకృత్, ఫాల్గుణం (1963)